క్లుప్తంగా

మేడిశెట్టికి దొరబాబు పరామర్శ



వీరభద్రాన్ని పరామర్శిస్తున్న దొరబాబు తదితరులు

సామర్లకోట: మాజీ ఎంపీపీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మేడిశెట్టి వీరభద్రాన్ని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు శుక్రవారం పరామర్శించారు. కొంతకాలం నుంచి వీరభద్రం అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై దొరబాబు ఆరా తీశారు. అదే విధంగా గ్రామంలోని 14వ వార్డు సభ్యుడు పిల్లి సతీష్ ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో, ఆయననూ దొరబాబు పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు తలారి దొరబాబు, నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, బదిరెడ్డి వీరప్రకాశరావు, సర్పంచ్ ఎం సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: మాధవపట్నం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ సామర్లకోట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మాధవపట్నం, వీకే రాయపురం, బోయనపూడి, ఉండూరు, మామిళ్లదొడ్డి, ఇండస్ట్రియల్ ఏరియాకు విద్యుత్‌సరఫరా ఉండదన్నారు.

పట్టణంలో..

పిఠాపురం రోడ్డులోని సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ చెప్పారు. బ్రౌన్‌పేట, కుమ్మర వీధి, నీలమ్మ చెరువు, పెన్షన్ లేన్, కొత్తూరు, మెహర్ కాంప్లెక్స్, సంపెంగ తోట తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పెద్దాపురం(సామర్లకోట): శతాబ్ది పార్కు ఎదురుగా ఉన్న పెద్దాపురం 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాత పెద్దాపురం, చేపల వీధి, తాడితోట, కుమ్మర వీధి, నాగేశ్వరరావు వీధి, పాత బస్టాండ్, వర్జులవారి వీధి, మిరపకాయల వీధి, మెయిన్ రోడ్డు, ఆర్‌బీ పట్నం రోడ్డు, శివాలయం వీధి, సినిమా రోడ్డు, వ్యాపార వుంత, గౌరీ కోనేరు, టైలర్స్ కాలనీ, కొత్తపేట, సత్తిరెడ్డిపేట, గోలివారి వీధి, మరిడమ్మ ఆలయం ఏరియా, శ్రీప్రకాష్ స్కూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉద్యోగుల పీజీఆర్ఎస్‌కు 13 అర్జీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కలెక్టరేట్‌లోని వివేకానంద హాల్‌లో శుక్రవారం ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ ఉద్యోగుల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో వివిధ సమస్యలపై 13 అర్జీలు అందాయని ఆయన తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లాలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మూడో శనివారం ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ జరుగుతుందని చెప్పారు.

అణచివేతపై.. నిరసన గళం



సామర్లకోట/కొత్తపల్లి: పాలకపక్ష అణచివేతకు గురవుతున్న పత్రికా స్వేచ్ఛను కాపాడాలని పాత్రికేయ లోకం గళమెత్తింది. ఈ మేరకు పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని పాత్రికేయులు శుక్రవారం ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, డీటీకి వినతిపత్రం సమర్పించారు. కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద పాత్రికేయులు ధర్నా చేసి, డిప్యూటీ తహసీల్దార్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉండే పాత్రికేయులను ఇబ్బందులు గురిచేయడం, పత్రికా విధులకు, విలువలకు ఆటంకం కలిగించినట్టేనని పాత్రికేయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల 'సాక్షి' దినపత్రికపై జరుగుతున్న దాడులే ఇందుకు నిదర్శనమని వివరించారు. తొలుత పెద్దాపురం డీఎస్పీ డి.శ్రీహరిరాజుకు వినతిపత్రం అందజేయాలని పాత్రికేయులు యత్నించగా, డీఎస్పీ గదిలోకి వెళ్లి తలుపులు మూసేయడంపై పాత్రికేయులు మండిపడ్డారు. ఈ క్రమంలో శుక్రవారం సామర్లకోట పోలీసు స్టేషన్‌లో సీఐ ఎ.కృష్ణభగవాన్ ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌ను బహిష్కరిస్తున్నట్లు వారు ప్రకటించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పాత్రికేయులు అడపా వెంకట్రావు, నూతాటి అశోక్, అడపా శ్రీనివాసు, పచ్చాకుల లోవరాజు, బి.విజయ్‌కుమార్, జి.సుబ్రహ్మణ్యం, బి.వెంకట్, టి.సుబ్రహ్మణ్యం, రాజేంద్ర, బూరాడ శ్రీనివాసరావు, దాసు, ఎం సూర్యనారాయణ, ఎస్‌కే మున్నీ, విల్సన్‌రాయ్, రాజా, ఎల్ అశోక్, మెయిళ్ల బాలు, పి.వెంకట్రావు, శ్రీనివాసరావు, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు. కొత్తపల్లిలో జరిగిన కార్యక్రమంలో పాత్రికేయులు ఎంవీవీ రమణ, ఎంఎస్ మూర్తి, కె.సతీష్, సీహెచ్ సతీష్, ఎం.చక్రధర్, ఎ.గంగాధర్, ఆర్.శ్రీనివాస్, కె.గోవింద్, జి.కిరణ్, ఎం.రవి, వి.పుల్లారావు, జె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ డీటీకి వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు



కొత్తపల్లిలో డీటీ మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టులు

పట్టు కోల్పోతున్న పత్తి

- నస్యరక్షణ చర్యల్లో సమన్వయం ఉండాలంటూ శాస్త్రవేత్తల సూచన
- ఓ పంట మందులు మరోదానిని దెబ్బ తీస్తున్నాయంటున్న అధికారులు
- పత్తి విత్తనాల నాణ్యతపై తేల్చని వైనం
- అయోమయ పరిస్థితుల్లో రెండు పంటల రైతులు



చేబ్రోలులో దెబ్బతిన్న పత్తి పంట

పిఠాపురం: ఓ పంట బాగుండాలంటే మరో పంట పోయినా మందులు పిచికారీ చేయకండంటూ అధికారులు సూచించడం రైతులను అయోమయానికి గురి చేస్తోంది. ఇటీవల పత్తి పంటలు పూర్తిగా దెబ్బతినడంతో నకిలీ విత్తనాల వల్లే నష్టపోయామంటూ పత్తి రైతులు ఆందోళనకు దిగారు. దీనిపై పంటలు పరిశీలించిన అధికారులు, శాస్త్రవేత్తలు.. విత్తనాలు నకిలీవా లేక మరేదైనా కారణం ఉందా అనే విషయాలను పరీక్షించి, నిర్ధారిస్తామంటూ శాంపిళ్లు తీసుకెళ్లారు. రెండు రోజుల్లో పత్తి పంట ఎందుకు పోయిందో నిర్ధారిస్తామన్న అధికారులు రెండు వారాలవుతున్నా దానిని పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల పట్టు రైతులకు సమావేశం నిర్వహించిన శాస్త్రవేత్తలు, అధికారులు చేసిన సూచనలు అటు పట్టు, ఇటు పత్తి రైతులను అయోమయానికి గురి చేశాయంటున్నారు. పత్తి పంటలు దెబ్బతినడానికి కారణం నకిలీ విత్తనాలని రైతులు అంటుంటే, దాని సంగతి తేల్చకుండా పంటలు దెబ్బతినడానికి తెగుళ్ల కారణమనే విధంగా అధికారులు సూచనలు చేస్తున్నారు మినహా, విత్తనాలపై అసలు విషయాన్ని తేల్చకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు పట్టు పంటలు దెబ్బతినడానికి వాటి పక్కనే ఉన్న పత్తి, ఇతర పంటలకు పిచికారీ చేసే పురుగు మందులే కారణమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. దీనిపై పత్తి రైతులు, పట్టు రైతులు సమన్వయం పాటించాలంటూ చెబుతున్నారు. పట్టు పంటల పక్కన ఉన్న పత్తి రైతులు పురుగు మందులు పిచికారీ చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ సూచించారు. ఒక పంటకు కొట్టే మందులు, మరో పంటకు ఎలా చేటు చేస్తుందంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.

ఎటూ తేల్చని అధికారులు..!

కాగా 120 రోజులే పంట కాలం.. అది పూర్తయిన వెంటనే మరో పంట వేసుకోవచ్చు.. అదనపు ఆదాయం వస్తుందంటూ విత్తన కంపెనీలతో పాటు, అధికారులు నమ్మబలకడంతో రైతులు ఆశపడి విత్తనాలు కొనుగోలు చేశారు. తీరా పంట వేశాకా విత్తనాల్లో తేడా ఉందని తెలిసి, పంట పండకుండానే నేల పాలవుతుండడంతో తాము మోసపోయామని భావించిన రైతులు తమకు జరిగిన నష్టాలకు బాధ్యులెవరనే దానిపై నిగ్గు తేల్చాలంటూ రోడ్డెక్కారు. మూడు రోజులుగా ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు.. ఇటీవల పిఠాపురం పాడా కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఫిర్యాదు చేశారు. నకిలీ విత్తనాలు అమ్మి తమను మోసం చేసిన కంపెనీపైనా, సంబంధిత ఉద్యోగుల పైనా, వాటిని విక్రయించిన దుకాణదారుల పైనా చర్యలు తీసుకుని, తమకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వచ్చిన అధికారులు మాత్రం కేవలం శాంపిళ్లు తీసుకెళ్లడం మినహా, వారాలు గడుస్తున్నా ఎటూ తేల్చడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. పంటలు నష్టపోయిన రైతులకు ఎటువంటి భరోసా ఇవ్వకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విత్తనాల సంగతీ తేల్చలేదు

వేదా కంపెనీకి చెందిన ప్లాటినం రకానికి చెందిన పత్తి విత్తనాలు ఎకరం భూమిలో సాగు చేశాం. పత్తి కాయలు కాసే దశలో ఎక్కడ మొక్క అక్కడ చనిపోవడం, ఎక్కడైనా పత్తికాయ పగిలితే నల్ల బారి కాయ రాలిపోతోంది. దీంతో తీవ్ర నష్టాల పాలయ్యాం. రెండు ఎకరాలు పత్తి సాగు చేయడం కోసం ప్లాటినం రకం విత్తనాలు స్థానిక సాయికృష్ణ ఏజెన్సీస్‌లో కొన్నాను. పూత, పిందె దశ నుంచి కాయ పగిలేటప్పటికీ, పత్తి మొక్క గిడసబారి గుడ్డి పత్తిలా పగులుతుంది. మొక్క చనిపోతుంది. గతేడాది ఎకరం పత్తి సాగు చేస్తే రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు లాభం. ఇప్పుడు పెట్టుబడి రూ.50 వేలు, శిస్తు రూ.30 వేలు వచ్చే పరిస్థితి లేదు. విత్తనాలమ్మిన దుకాణదారుడు మాకు సంబంధం లేదని చెబుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. శాంపిళ్లు సేకరించారు మినహా, విత్తనాల సంగతి తేల్చడం లేదు. నష్ట పరిహారం సంగతి అసలు పట్టించుకోవడం లేదు.

– ఓరుగంటి సూర్యచంద్రశేఖర్, పత్తి రైతు, చేబ్రోలు

సంపూర్ణ ఆరోగ్యానికి జిమ్ దోహదం



జిమ్ పరికరాలను ప్రారంభించిన ఎంఈఓలు, కౌన్సిలర్

సామర్లకోట: ప్రతి ఒక్కరి ఆరోగ్యానికి వ్యాయామం ఎంతో మేలు చేస్తుందని మండల విద్యా శాఖాధికారులు వై శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య అన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను వార్డు కౌన్సిలర్ బలుసు వాసుతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థులు హైస్కూల్ స్థాయి నుంచి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం గంట పాటు వ్యాయామం చేయడం ద్వారా ప్రశాంతత ఏర్పడుతుందని చెప్పారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించారు. విద్యా కమిటీ చైర్మన్ అక్కిన చక్రధర్, ఉపాధ్యాయులు కేజీ భవాని, ఎస్ హరనాథ్, శిరీష, పీడీ పి.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు తప్పనిసరి



పెద్దాపురంలో బాణసంచా షాపును పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి, తహసీల్దార్ వెంకటలక్ష్మి

ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం(సామర్లకోట): బాణసంచా వ్యాపారులు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి ఆదేశించారు. శుక్రవారం పెద్దాపురం, జగ్గంపేట మండలాల్లో బాణసంచా తయారీ కేంద్రాలు, విక్రయ షాపులను ఆమె పరిశీలించారు. వ్యాపారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా తయారు చేసినా, విక్రయాలు చేసినా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. లైసెన్సులు పొంది వ్యాపారం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పెద్దాపురం తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, పెద్దాపురం పట్టణ, మండల పరిధిలో 32 షాపులకు అనుమతి ఇచ్చినట్టు తెలిపారు.

నిబంధనలు పాటించాలి

సామర్లకోట: బాణసంచా వ్యాపారులు భద్రతా ప్రమాణాలను పాటించాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో సామర్లకోట, ఉండూరు, వేట్లపాలెం, జి.మేడపాడు, పీబీ దేవం గ్రామాల్లో బాణాసంచా తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసే వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ప్రతి షాపు వద్ద నీళ్ల డ్రమ్‌తో పాటు, ఇసుక, అగ్నిమాపక పరికరాలు ఉండాలన్నారు. అదేవిధంగా బాణాసంచా షాపులకు దూరంగా వాహనాలను పార్కింగ్ చేసుకునేలా నిర్దేశించారు. దీపావళి రోజున ఐదు గంటలకే షాపులను మూసివేయాలన్నారు. సామర్లకోటలో సాంకేతిక శిక్షణాభివృద్ధి కేంద్రం వద్ద అనుమతి పొందిన షాపుల నిర్వాహకులు అతి జాగ్రత్తగా షాపులు నిర్వహించాలన్నారు. మొదటిసారిగా షాపుల ఏర్పాటుకు అనుమతి రావడంతో ఎవరికీ, ఎటువంటి ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఇరువైపులా షాపులను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బాణాసంచా విక్రయించాక ఖాళీ బాక్సులను దూరంగా ఉంచాలని సూచించారు. వాహనాలు లోనికి రాకుండా ఇరువైపులా డివైడర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని సూచించారు. ప్రతి ఏడాది అమ్మకాలు చేసే ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో అనుమతి లేకపోవడంతో ఈ మార్పు చేశామని తెలిపారు. మూడు రోజుల పాటు వివిధ శాఖల అధికారుల తనిఖీలు ఉంటాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మహిళల ఆర్థికాభివృద్ధికి 'లయన్స్' కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈశ్వరకుమార్

సామర్లకోట: సమాజంలో మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శారీస్ స్క్రీన్ పెయింటింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు క్లబ్ జిల్లా పూర్వ గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్ అన్నారు. రెండు రోజుల పాటు మహిళలకు ఇచ్చే ఉచిత శిక్షణను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కాటన్ చీరలతో పాటు, సాదా చీరలపై ఈ స్క్రీన్ పెయింటింగ్‌తో చీరలు ఆకర్షణీయంగా ఉంటాయన్నారు. ఈ శిక్షణ పొందడానికి రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేల వరకు ఖర్చవుతుందన్నారు. లయన్స్ క్లబ్ ముందుకొచ్చి ఈ శిక్షణ ఉచితంగా ఇస్తున్నట్టు చెప్పారు. పేద ప్రజలకు సేవలు అందిచడంతో సామర్లకోట లయన్స్ క్లబ్ ముందంజలో ఉందని తెలిపారు. క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తులూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మహిళలు ఆసక్తితో శిక్షణ పొంది ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ఇప్పటికే తమ క్లబ్ ద్వారా ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చి, అనేక మందికి కుట్టు మెషీన్లు ఉచితంగా అందజేసినట్టు చెప్పారు. టీచర్లు బి.జ్యోతి, వై.మాధవి శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కోశాధికారి యేలేటి రమేష్, మాజీ అధ్యక్షుడు గుండు శంకరరావు, బుర్రే కృష్ణమోహన్, కర్రి ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్తిక మాస ఏర్పాట్లపై నేడు సమావేశం

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో కార్తిక మాసంలో స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు చేయాల్సిన ఏర్పాట్లపై శనివారం ఉదయం కాకినాడ ఆర్డీఓ ఎస్ మల్లిబాబు అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. పట్టణ ప్రముఖులు, ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘ నాయకులు, రైతులు, భక్తులు ఈ సమావేశంలో పాల్గొని, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని చెప్పారు.

ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి

సీనియర్ డీఎస్‌టీకి పలువురి వినతి



సతీష్‌శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అప్పలకొండ తదితరులు

సామర్లకోట: కీలకంగా ఉన్న సామర్లకోట రైల్వే స్టేషన్ పరిధిలో ప్రయాణికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అన్నారు. స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని ప్రయాణికుల నుంచి సూచనలు స్వీకరించడానికి విజయవాడ సీనియర్ డివిజనల్ సిగ్నల్ అండ్ టెలికమ్ ఇంజినీర్ పి.సతీష్‌శంకర్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలకొండ మాట్లాడుతూ, సామర్లకోట రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న బస్సు కాంప్లెక్స్‌ను కలుపుతూ వంతెన నిర్మిస్తే ట్రాఫిక్ సమస్య ఉండదన్నారు. రెండో వంతెన, ఎక్స్‌లేటర్ ప్రయాణికులకు కలగా మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్ద కాలంగా ఉన్నతాధికారులు ఊరిస్తున్నారు మినహా పనులు చేయడం లేదని విమర్శించారు. రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ బుకింగ్ ఉదయం 11.30కే మూసివేయడంతో జగ్గంపేట, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, కిర్లంపూడి తదితర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సామర్లకోట రైల్వే జంక్షన్‌ను దృష్టిలో ఉంచుకొని 24 గంటలు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలన్నారు. రైల్వే ఎంక్వైరీలో సమాధానం ఇచ్చే నాథుడు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రయాణికుల ప్రశ్నలకు ఎంక్వైరీలో ఉన్నవారు చిరాకు పడుతున్నారన్నారు. ఎంక్వైరీ 24 గంటలు ప్రయాణికులకు ఓపికతో సమాధానం ఇచ్చేవారిని నియమించాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే స్టేషన్‌లోని అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని, పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ఈ మేరకు సీనియర్ డీఎస్‌టీఈకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డీఎస్‌టీ జి.నాగేశ్వరరావు, డీఆర్‌యూసీ సభ్యులు ఎం అనిల్‌కుమార్, నాగేశ్వరరావు, స్టేషన్ కన్సల్టింగ్ మెంబర్లు పెన్నాడ జగన్నాథ్, వల్లూరి బుల్లియ్య, సుంకవిల్లి బాపిరాజు, రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడికి నిరసనగా ధర్నా

సామర్లకోట: సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసనగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. దాడి జరిగి వారం గడిచినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ ఆందోళన చేశారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పి.చిన్నిబాబు, అనంతపు రాజు, రసాద హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తి నిర్మాణం.. నిరుపయోగంగా భవనం

పుష్కరం గడిచినా పూర్తికాని వైనం



శ్లాబుకే పరిమితమైన కమ్యూనిటీ భవనం

కొత్తపల్లి: గ్రామంలో నిరు పేదలు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రజాప్రతినిధులు ముందుకొచ్చారు. భవన నిర్మాణానికి సంబంధించి నిధులు పూర్తి స్థాయిలో చాలలేదనే ఉద్దేశంతో భవన నిర్మాణాన్ని నిలిపివేశారు. అప్పటి ఎమ్మెల్యే వంగా గీత 2013 జూన్ 15న ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.25 లక్షలతో కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఆ భవన నిర్మాణం శ్లాబుకే పరిమితమైంది. భవనానికి గోడలు నిర్మించకుండానే పనులు నిలిపివేశారు. భవనం పూర్తి కాకుండానే 2016 డిసెంబర్ 27న అప్పటి ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ దీనిని ప్రారంభించారు. భవనం వద్ద శిలాఫలకం మిగిలిందే మినహా, భవన నిర్మాణం పూర్తి చేసేందుకు ఎటువంటి నిధులు మంజూరు కాలేదు. అప్పటి నుంచి ఆ భవనం నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా, అప్పట్లో మంజూరైన నిధులు చాలకపోవడంతో పనులు నిలిచిపోయాయన్నారు. నిధులు మంజూరైతే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.



భవనం పూర్తి కాకుండానే ప్రారంభించినప్పటి శిలాఫలకం



కమ్యూనిటీ భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం